ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



తమిళనాడు

TAMILNADU

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025



టాటా పవర్ సోలార్ కర్మాగారంలో మీటనొక్కి ఉత్పత్తిని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రూ.3800 కోట్లతో టాటా పవర్ సోలార్

- తిరునల్వేలిలో ప్రారంభించిన సీఎం
- విక్రమ్ సోలార్ కర్మాగారానికి శంకుస్థాపన
- రెండు కర్మాగారాల్లో 6500 మందికి ఉపాధి

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా గంగైకొండాన్ సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్కులో రూ.3800 కోట్లతో 4.3 జిగావాట్ సోలార్ సెల్, మాడ్యూల్ కర్మాగారాన్ని సీఎం స్టాలిన్ గురువారం ఉదయం ప్రారంభించారు. ఈ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి 2022 జూలైలో టాటా పవర్ సోలార్ సంస్థతో ప్రభుత్వం అవగాహన కుదుర్చుకుంది. ఈ మేరకు నిర్మాణ పనులన్నీ పూర్తి చేసుకున్న ఆ కర్మాగారంలో మీట నొక్కి ఆయన ఉత్పత్తిని ప్రారంభించారు. ఈ కర్మాగారం ద్వారా 4 వేల మందికి ఉపాధి అవకాశాలు కలిగాయని, వీరిలో ప్రత్యేకించి 80 శాతం మంది మహిళలని స్టాలిన్ తెలిపారు. కర్మాగారంలో పనిచేసే మహిళల కోసం ఇటీవలే తన చేతుల మీదుగా వసతి గృహాలు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. ప్రారంభోత్సవం తర్వాత కర్మాగారంలో ఉన్న వివిధ విభాగాలను ఆయన పరిశీలించారు. ప్రారంభోత్సవం సందర్భంగా టాటాగ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా పాల్గొని ప్రసంగించారు.

మరో కర్మాగారానికి శంకుస్థాపన...

ఇదే విధంగా ఆ సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్కు వద్దే విక్రమ్ సోలార్ లిమిటెడ్ సంస్థ రూ.2574 కోట్లతో నిర్మించనున్న సోలార్ పవర్ కర్మాగారానికి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఈ కర్మాగారంలోనూ 2500 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆయన చెప్పారు. ఈ కర్మాగారంలో 3 జిగా వాట్ల సోలార్‌సెల్, 6 జిగావాట్ల మాడ్యూల్స్ ఉత్పత్తి అవుతాయని తెలిపారు. ఈ రెండు కర్మాగారాల ద్వారా ఉత్పత్తి అయ్యే సోలార్ పవర్‌తో రాష్ట్రం విద్యుదుత్పాదనలో మరింత పురోగతి సాధిస్తుందన్నారు.

ఆయా కార్యక్రమాల్లో స్పీకర్ అప్పావు, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, గీతా జీవన్, అనితా రాధాకృష్ణన్, టీఆర్బీ రాజా, ఎం.ఈసి. రాబర్ట్ బ్రూస్, శాసనసభ్యులు ఎం.అబ్దుల్ వహాబ్, రూబీ మనోహరన్, నయినార్ నాగేంద్రన్, పారిశ్రామిక వాణిజ్య పెట్టుబడుల ప్రోత్సాహక శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, పారిశ్రామిక మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ధారేస్ అహమ్మద్, తిరునల్వేలి జిల్లా కలెక్టర్ కేపీ కార్తికేయన్, టాటా పవర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ సిన్హా, సీఈఓ దీపేష్ నందా, విక్రమ్ సోలార్ సంస్థ అధ్యక్షుడు ఎమరిటస్ హరికృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సభలో బీజేపీ ఎమ్మెల్యే...

ఈ రెండు కార్యక్రమాలలో బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు నయినార్ నాగేంద్రన్ పాల్గొన్నారు. రెండు సభలలోనూ నిర్వాహకులు ఆయనను మంత్రులతో సమానంగా వేదికపైనే కుర్చీ వేశారు. బీజేపీ తిరునల్వేలి శాఖ నాయకులు కూడా విచ్చేశారు.



తిరునల్వేలి టాటా పవర్ సోలార్ కర్మాగారంలో పనిచేస్తున్న మహిళా కార్మికులతో స్టాలిన్

ఆస్తిపన్ను చెల్లించకుంటే క్యూఆర్ కోడ్‌తో నోటీసులు

జీసీసీ నిర్ణయం ● 2లక్షల మంది నుంచి త్వరలో వసూళ్లు

ప్యారీస్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పన్నులు సక్రమంగా చెల్లించని సుమారు 2లక్షల మందికి 'క్యూఆర్ కోడ్' నోటీసు జారీ చేయనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ హెచ్చరించింది. జీసీసీ అధీనంలోవున్న 15 జోన్ల పరిధిలో 200వార్డుల్లో దాదాపు 13లక్షల మందికి పైగా సొంత కట్టడాల యజమానులుండగా వారినుంచి సంవత్సరానికి రూ.1,880కోట్లకు పైగా పన్ను వసూలు కావాల్సి ఉంది. ఒక్కో ఆర్థిక సంవత్సరంలో, అర్ధ సంవత్సరంలో ఆస్తులకు సంబంధించిన పన్నుల వసూళ్ల ప్రక్రియను జీసీసీ అధికారులు చేపడుతున్నారు. అర్ధ సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ లోపు, 2వ సంవత్సరంలో అక్టోబరు 1 నుంచి 30వ తేదీ వరకు పన్ను చెల్లించే వారికి రూ.5వేలు ప్రోత్సాహక నగదును జీసీసీ పంపిణీ చేస్తోంది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలంగా పన్ను బకాయి ఉన్న వ్యాపార భవనాలు, అపార్ట్‌మెంట్ల యజమానులు సుమారు 2లక్షల మందిని గుర్తించి వారికి పన్ను చెల్లించాలని నోటీసులు జారీ చేయాలని కార్పొరేషన్ నిర్ణయించింది. గత ఏడాది సక్రమంగా పన్ను చెల్లించని 100 ప్రముఖ వ్యాపార సంస్థల జాబితాను కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో విడుదల చేయగా, పలువురు పన్నులు చెల్లించారు. అదేవిధంగా ఇళ్లు, చిన్న తరహా వాణిజ్య కట్టడాల యజమానులు రూ.5వేలకు పైగా ఆస్తిపన్ను చెల్లించలేదు. ఈ 2లక్షల మందికి క్యూఆర్ కోడ్ ద్వారా బకాయిలు చెల్లించే అవకాశాన్ని జీసీసీ కల్పించింది. క్యూఆర్ కోడ్‌లో స్కాన్‌చేసి ఆస్తిపన్నులు చెల్లించవచ్చు అయితే పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఆస్తిపన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరికలు జారీ కావడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో జీసీసీ ఇప్పటివరకు రూ.1,660కోట్ల పన్నులు వసూళ్లు చేసింది. ఇది గత ఏడాది కంటే రూ.250కోట్లు అధికం. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31వరకు ఆస్తులకు సంబంధించిన పన్నులను చెల్లించేందుకు కల్పించిన అవకాశాన్ని యజమానులు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ సూచించింది.

అప్పుడే ఎండలు!

సాధారణం కన్నా 3 డిగ్రీలు పెరగనున్న ఉష్ణోగ్రతలు



పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న 48 గంటల్లో పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 డిగ్రీలు పెరిగే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాలు సీజన్ కన్నా భిన్నంగా జనవరి 26వ తేది వరకు మొత్తం 104 రోజులు కొనసాగాయి. ఈ ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిశాయి. అదే సమయంలో, ఈ ఏడాది సీజన్‌కు భిన్నంగా ఫిబ్రవరి మొదటి వారం నుంచే పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 11 గంటల తర్వాత ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ విషయమై ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో శుక్రవారం నుంచి ఈనెల 11వ తేది వరకు పొడి వాతావరణం నెలకొంటుంది. శుక్ర, శనివారాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగనున్నాయి. ఉదయం వేళల్లో స్వల్పంగా మంచు కురుస్తోందని, రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది.



ఓ బస్సులో తనిఖీ చేస్తున్న అటవీశాఖ అధికారి

రాష్ట్రంలోనే తొలిసారిగా నైట్ పెట్రోలింగ్

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అటవీ జంతువుల వేటను నిరోధించే దిశగా రాష్ట్రంలోనే తొలిసారిగా అటవీశాఖ అధికారులు రాత్రిపూట గస్తీని ప్రారంభించారు. రాష్ట్రంలోని ముదుమలై పులుల అభయారణ్యం సహా కర్ణాటకలోని బందిపూర్ పులుల అభయారణ్యం, కేరళలోని ముత్తంగా అభయారణ్యం ఉన్నాయి. మూడు రాష్ట్రాలకు చెందిన అభయారణ్యాల అనుసంధాన ప్రాంతంగా నీలగిరి జిల్లా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఊటీ సమీపం కేత్తి, ఒవేలి ప్రాంతాల్లో జింకలను వేటాడటం, కలప స్మగ్లింగ్ కార్యకలాపాలు అధికంగా జరుగుతున్నాయంటూ ఫిర్యాదులు వచ్చాయి. అదే సమయంలో గూడలూరు సమీపం దేవర్‌సోలైలో జనవరి 25 రాత్రి స్నేహితులతో వేటకు వెళ్లిన జంషీర్ (37) అనే వ్యక్తి తుపాకీ తూటా దూసుకెళ్ళి మృతిచెందారు. ఆ సంఘటనకు సంబంధించి పోలీసులు 14 మందిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో నీలగిరి జిల్లాల్లో అటవీ జంతువుల వేటను నిరోధించడానికి బుధవారం నుంచి రాత్రిపూట గస్తీని ప్రారంభించారు. నీలగిరి జిల్లా ఫారెస్టు అధికారి గౌతం నాయకత్వంలో అటవీ శాఖ అధికారులు బుధవారం రాత్రి గస్తీ నిర్వహించారు. మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాతమైన భైక్రా జంక్షన్ వద్ద అటవీ శాఖఅధికారులు రాత్రిపూట గస్తీని ప్రారంభించారు. బస్సులను, లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

తిరుపూరులో భూప్రకంపనలు

● ప్రాణభయంతో పరుగులు తీసిన ప్రజలు

అడయార్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం భూప్రకంపనలు కనిపించాయి. దీంతో ఆయ ప్రాంతాల ప్రజలు ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఒక్కసారిగా భూమి ఇలా కంపించడానికి కారణం ఏంటి? నిజంగానే భూ ప్రకంపనలు సంభవించాయా? లేదా క్వారీల్లో బాంబులు పేల్చడం వల్ల ఇల భూమి కంపించిందా అనే విషయంపై ఆరా తీస్తున్నారు. తిరుపత్తూరు సమీపంలోని కొరట్టి, ఆసిరియర్ నగర్ తదితర ప్రాంతాల మొదలుకుని కృష్ణగిరి జిల్లాలోని బర్గూరు వరకు బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఈ భూ ప్రకంపనలు కనిపించాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయంతో వణికిపోయారు. కొన్ని నిమిషాల పాటు ప్రకంపనలు కనిపించడంతో స్థానికులు తమ ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న స్థానిక రెవెన్యూ అధికారులు భూ ప్రకంపనలు కనిపించిన ప్రాంతాలను పరిశీలించారు. అయితే, ఈ ప్రకంపనల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు అధికారయంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.







బోల్తాపడిన బస్సు నుంచి వెలుపలికి వస్తున్న విద్యార్థులు - తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



తిరుప్పూరు వద్ద బస్సు బోల్తా

ఇద్దరు కాలేజీ విద్యార్థుల మృతి

- 20 మందికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- సీఎం స్టాలిన్ సంతాపం

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కాలేజీ విద్యార్థులు దుర్మరణం చెందారు. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ ప్రమాదంలో పలువురు కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. తిరుప్పూరు కొత్త బస్‌స్టేషన్ నుంచి ఈరోడ్‌కు గురువారం ఉదయం ఓ ప్రైవేటు బస్సు బయలుదేరింది. ఆ బస్సులో ఈరోడ్ సమీపం పెరుందురైలోని కళాశాలల్లో, పాఠశాలల్లో చదివే విద్యార్థులు సహా 50 మంది ప్రయాణించారు. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో తిరుప్పూరు జిల్లా చెంగపల్లి పల్లగౌండర్‌పాళయం వద్ద కోయంబత్తూరు - సేలం జాతీయ రహదారిలో కంటైనర్ లారీని అధిగమించే ప్రయత్నంలో అదుపుతప్పిన బస్సు రోడ్డు పక్క బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు పెరియసామి (19), హరికృష్ణన్(19) అక్కడికక్కడే మృతి చెందారు. ఐదుగురు విద్యార్థులకు కాళ్లు చేతులు విరిగాయి.మరో ఇద్దరు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కొంతమంది ప్రయాణికులు బస్సు నుంచి దూరంగా రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఊత్తుకుళి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బస్సు శిథిలాల మధ్య ఉన్న విద్యార్థులను వెలికి తీసి పెరుందురై ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా చెంగపల్లి కోయంబత్తూరు- సేలం జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మృతుల కుటుంబీకులకు రూ.3లక్షల సాయం...

తిరుప్పూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద గురించి తెలుసుకున్న సీఎం స్టాలిన్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కాలేజీ విద్యార్థులు పెరియసామి, హరికృష్ణన్ కుటుంబీకులకు తలా రూ.3లక్షల ఆర్థికసాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇదే విధంగా తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నవారికి తలా రూ.లక్ష చొప్పున, స్వల్పగాయాలతో చికిత్స పొందుతున్నవారికి తలా రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నవారికి మెరుగైన వైద్యసేవలందించాల్సిందిగా స్థానిక అధికారులకు ఆదేశాలిచ్చినట్లు స్టాలిన్ పేర్కొన్నారు.



ప్రమాదస్థలం వద్ద గుమికూడిన ప్రజలు

స్ట్రాంగ్‌రూంకు చేరిన ఈవీఎంలు



పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ ఉప ఎన్నిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను (ఈవీఎంలు) స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఈ నియోజకవర్గం పోలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగిన విషయం తెలిసిందే. ఓటింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలను పెట్టెల్లో భద్రపరచి సీలు వేశారు. అనంతరం ఈ పోలింగ్‌లో వినియోగించిన 237 ఈవీఎంలను వాహనాల ద్వారా ఓట్ల లెక్కింపు జరగనున్న చిత్తోడులోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలకు తరలించి, అక్కడ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరచి సీలు వేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సాయుధ పోలీసులు భద్రత చేపట్టగా, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూం ద్వారా పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 8న శనివారం ఇదే కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

మార్చి నుంచి బీచ్ - తాంబరం మధ్య ఏసీ రైలు

● ఛార్జి రూ.95



చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీచ్ స్టేషన్ నుంచి తాంబరం ప్రాంతానికి విద్యుత్ లోకల్ ఏసీ రైలు సేవలు మార్చి నుంచి ప్రారంభమవుతున్నాయి. పెరంబూరులోని ఐసీఎఫ్‌లో 12 బోగీలతో తయారైన ఈ ఏసీ రైలులో ప్రయాణికులు కూర్చునేందుకు 1,320 సీట్లున్నాయి. ఇటీవలే ఈ ఏసీ రైలు ట్రయల్ రన్ జరిగింది. రెండు వారాల్లో ఐసీఎఫ్ అధికారులు తాము తయారు చేసిన రెండు ఏసీ రైళ్లను దక్షిణ రైల్వే అధికారులకు అప్పగించనున్నారు. ఈ రైలులో కూర్చుని, నిల్చుని సుమారు 5,700 మంది ప్రయాణించడానికి వీలుందని అధికారులు చెప్పారు. దక్షిణ రైల్వేలో ఏసీ రైళ్ల ఛార్జీలు 9 కిలోమీటలర్ల దూరానికి రూ.35, 15 కి.మీ.ల దూరానికి రూ.50, 24 కి.మీ.ల దూరానికి రూ.70, 34 కి.మీ.ల దూరానికి రూ.95 చొప్పున వసూలు చేస్తున్నారు. ఆ ప్రకారం బీచ్ నుంచి తాంబరం వరకు 28.6కి.మీ.ల దూరానికి రూ.95 ఛార్జీగా వసూలు చేసే అవకాశం ఉంది. అయితే ఈ రైలు లోకల్ విద్యుత్ సబర్బన్ రైలు కనుక ఆ ఛార్జీని అధికారుల తగ్గిస్తారని తెలుస్తోంది.



విద్యార్థినికి పట్టాను ప్రదానం చేస్తున్న ప్రసన్నకుమార్

సవాళ్లను అధిగమించి విజయం సాధించాలి

యువ పట్టభద్రులకు ఎన్ఎల్‌సీ సీఎండీ ప్రసన్నకుమార్ పిలుపు

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు తమకు ఎదురయ్యే సవాళ్లను అధిగమించి విజయం సాధించి మాతృదేశానికి తమ వంతు సేవలను అందించాలని ఎన్ఎల్‌సీ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి పిలుపునిచ్చారు. అన్నా విశ్వవిద్యాలయంలో దాని అనుబంధ కళాశాలలకు సంబంధించిన స్నాతకోత్సవం గురువారం ఉదయం ఆ విశ్వవిద్యాలయంలో వివేకానంద ఆడిటోరియంలో జరిగింది. అన్నావిశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎస్.ఉషా తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసన్నకుమార్ మోటుపల్లి స్నాతకోత్సవ ప్రసంగం చేస్తూ... పాశ్చాత్య దేశాల్లో భారతీయ సంస్కృతీసంప్రదాయాలను ఎలుగెత్తి చాటిచెప్పి స్వదేశానికి తిరిగొచ్చిన స్వామి వివేకానంద చెన్నై నగరంలో అడుగుపెట్టిన రోజే యువపట్టభద్రులు తన చేతుల మీదుగా పట్టాలు అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. పట్టభద్రులు అదనపు ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సమాచార దర్శిని

కేంద్ర పారిశ్రామిక భద్రతా విభాగానికి అభ్యర్థుల ఎంపిక

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పారిశ్రామిక భద్రతా విభాగంలో కానిస్టేబుల్, డ్రైవర్ సహా పలు విభాగాల్లో 1,124 పోస్టులు భర్తీ చేయనున్నారు. టెన్త్ ఉత్తీర్ణులై 21 నుంచి 27 ఏళ్లలోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దేహదారుఢ్య పరీక్ష, రాత పరీక్ష, సమగ్ర వైద్య పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఫీజుతో పాటు దరఖాస్తులను మార్చి 4వ తేదిలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. వివరాలకు cisfectt.cist.gov.inలో సంప్రదించవచ్చు.

నేడు ఎగ్మూర్‌లో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ జరగనుంది. ఓట్టేరి కుక్స్ రోడ్డులోని 110 కిలో వాట్ ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో ఉన్న నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో జరగనున్న ఈ శిబిరంలో, వినియోగదారులు పాల్గొని బిల్లులు, కనెక్షన్లు, పేర్లు మార్పు సహా పలు సమస్యలకు పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు తెలిపింది.

ఉచిత వివాహాలకు రిజిస్ట్రేషన్ ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేది ఉచిత వివాహాలు జరగనున్నాయి. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో వివాహం చేసుకొనే వధూవరులకు అర సవర తాళి, మంచం, బీరువా, పరుపు, వంట సామానులు, సరుకులు తదితరాలను ప్రభుత్వం తరపున అందించనున్నారు. ఈ ఆలయాల్లో వివాహం చేసుకొనేందుకు ఆసక్తి ఉన్న కుటుంబ సభ్యులు, వరుడు, వధువు ఆధార్ కార్డులతో తిరుమలైవయావూర్ ప్రసన్న వెంకటేశ్వర పెరుమాళ్ ఆలయ నిర్వహణ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు ఆలయ కార్యనిర్వాహక అధికారి మొబైల్ నెం.9940651389లో సంప్రదించవచ్చు.

13న పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగనున్నాయి. ఈ పరీక్షలు సజావుగా జరిగేలా పాఠశాల విద్యాశాఖ ముందస్తు ఏర్పాట్లు చేపడుతోంది. ఈ క్రమంలో, పబ్లిక్ పరీక్షల ముందస్తు ఏర్పాట్ల సమీక్షా సమావేశం ఈనెల 13న పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ నేతృత్వంలో చెన్నైలో జరగనుంది. ఈ సమావేశంలో విద్యాశాఖ డైరెక్టర్లు, జిల్లా ప్రధాన విద్యాధికారులు పాల్గొంటారని, పరీక్షల్లో మాస్ కాపీయింగ్ సహా పలు అవకతవకలను అడ్డుకొనే అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు అధికారులు తెలిపారు.

14నుంచి పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్‌వన్, ప్లస్ టూ తరగతుల పబ్లిక్ పరీక్షలు మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగనున్నాయి. ఈ పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్న (తత్కాల్ సహా) ప్రైవేటు అభ్యర్థులు ఈనెల 14వ తేది నుంచి ప్రభుత్వ పరీక్ష శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు నెంబరు, పుట్టిన తేది నమోదు చేసి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్లస్‌వన్ అరియర్స్ ఉండీ ప్లస్‌టూ పబ్లిక్ పరీక్ష రాసే ప్రైవేటు అభ్యర్థులకు ఒకే హాల్ టిక్కెట్ ఉంటుందని ప్రభుత్వ పరీక్ష శాఖ ప్రకటించింది.

రేపు రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు సవరణలకు చెన్నైలోని 19 మండల కార్యాలయాల్లో శనివారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. వినియోగదారుల సమస్యలు తెలుసుకునేలా ఆహార శాఖ ప్రతి నెలా శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ నెలకు సంబంధించిన సమావేశం ఈనెల 8వ తేది ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చడం, తొలగింపు, చిరునామా, మొబైల్ నెంబర్ల మార్పు తదితరాలు సహా రేషన్ దుకాణాల్లో అందిస్తున్న సరుకుల నాణ్యత, ఇతరత్రా సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

ముమ్మరంగా వెండి రథం తయారీ పనులు



పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లయప్పర్ ఆలయంలో వెండి రథం తయారీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తిరునల్వేలి టౌన్ నెల్లయప్పర్ గాంధీమతి అమ్మవారి ఆలయ వెండి రథంలో 33 ఏళ్ల క్రితం మంటలు చెలరేగి దెబ్బతినింది. ప్రస్తుత కొత్త వెండి రథం నిర్మాణపనులు చేపట్టారు. టేకు చెక్కతో తయారవుతున్న ఈ రథానికి రెండు గుర్రాలను వెండి పూతతో కూడిన రెండు ధారుశిల్పాలు రూపొందించే పనులు జరుగుతున్నాయి. 16 అడుగుల ఎత్తుతో 450 కిలోల వెండితో ఈ రథం రూపొందుతోంది. రథం తయారీకి రాజారత్నం, సభాపతి అనే భక్తులు 100 కిలోల వెండిని ఇదివరకే విరాళంగా అందజేశారు. ప్రస్తుతం రథం తయారీకి అవసరమైన వెండి లభించలేదని, భక్తులు, దాతలు వెండిని కానీ, వెండి కొనుగోలుకు నగదు విరాళంగా అందించాలని ఆలయ ట్రస్టీ చైర్మన్ చెల్లయ్య విజ్ఞప్తి చేశారు.

తైపూసం, వారాంతపు సెలవులు
1,320 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తైపూసం, వారాంతపు రోజుల సందర్భంగా ప్రజల సౌకర్యార్థం 1,320 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర రోడ్డు ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) ఎండీ ఆర్.మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం నుంచి 9వ తేది వరకు వారాంతపు సెలువులు, శుభ ముహూర్తాలు, తైపూసం సందర్భగా స్థానిక కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు 910 ప్రత్యేక బస్సులు నడపనున్నామని తెలిపారు. అలాగే, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 120 బస్సులు, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర నగరాల నుంచి పలు ప్రాంతాలకు 250 ప్రత్యేక బస్సులు, మాధవరం నుంచి 40 బస్సులు నడుపున్నామన్నారు. అలాగే, ఆదివారం స్వగ్రామాల నుంచి తిరిగి వచ్చే వారి కోసం పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయి. వారాంతపు సెలవుల్లో ఊర్లకు వెళ్లేందుకు శుక్ర, శనివారాల్లో 20,000 మంది ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నారని ఎస్ఈటీసీ ఎండీ తెలిపారు.

తిరువళ్లీశ్వరర్ ఆలయంలో తైకృత్తిక వేడుకలు



క్రేన్ నుండి వేలాడుతూ రేకుల రథంపై పూలవర్షం కురిపిస్తున్న భక్తులు



భక్తుల మధ్య ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



నోటికి శూలానికి గుచ్చుకుని ఆలయానికి వస్తున్న బాలుడు

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాడిలో ఉన్న సుప్రసిద్ధ శైవాలయం తిరువళ్లీశ్వరర్ ఆలయంలో గురువారం ఉదయం తైకృత్తిక వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వేలాదిమంది మురుగప్పెరుమాన్ భక్తులు తరలివచ్చారు. వేడుకలలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు వంటికి, నోటికి శూలాలు గుచ్చుకుని, పూలకావళ్లు మోసుకొచ్చారు. కొంతమంది భక్తులు ఇనుపకమ్మీలను వీపునకు తగిలించుకుని స్వామివారి ప్రతిమలున్న చిన్న సైజు రేకుల రథాలను లాగారు. ఇదే విధంగా కొంతమంది యువకులు భారీ క్రేన్ నుంచి వీపునకు ఇనుప కొక్కేల గుచ్చుకుని వేలాడుతూ స్వామివారి రథంపై పూల వర్షం కురిపించారు.

రామేశ్వరం ఆలయానికి త్రిశూలాలు
ఢిల్లీ భక్తుల విరతణ



త్రిశూలాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం రామనాథస్వామి ఆలయానికి ఢిల్లీ భక్తులు మూడు త్రిశూలాలు వితరణగా అందజేశారు. రామేశ్వరం ఆలయానికి ప్రతిరోజు రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనం చేసుకుంటుంటారు. అలాగే, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, హరియాణా సహా పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు రామనాథస్వామిని కులదైవంగా పూజిస్తుంటారు. తమ కోర్కెలు తీరిన సమయంలో భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఈ నేపథ్యంలో, ఢిల్లీ చెందిన భక్తులు సాగుచేసిన గోధుమ పంట అధిక దిగుబడులతో ఆదాయం వచ్చింది. దీంతో ఆలయానికి 5 అడుగుల నుంచి 10 అడుగుల 3 త్రిశూలాలను బుధవారం వీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

వేడుకగా మారియమ్మన్ ఆలయ వసంత పంచమి వేడుకలు



ప్రత్యేక వేషధారణలో కళాకారుల సందడి

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారై ఎంజీఆర్ నగర్‌లోని మారియమ్మన్ ఆలయ 41వ వార్షిక వసంత పంచమి వేడుకలు గత నెల 29వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈనెల 3వ తేది అమ్మవారికి తిరుకల్యాణం నిర్వహించారు. బుధవారం రాత్రి నెడుమలై బ్రిడ్జి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలో ఆశీనులైన అమ్మవారు వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తమ ప్రాంతాలకు వస్తున్న అమ్మవారిని భక్తులు పూలు చల్లి, కర్పూర హారతులిచ్చి, టెంకాయలు కొడుతూ స్వాగతం పలికారు. ఊరేగింపులో కళాకారులు పలు వేషధారణలతో చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పంట రుణాలు మాఫీ చేయాలి

● బీజేపీ రాష్ట్ర చీఫ్ అన్నామలై డిమాండ్

ప్యారీస్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతుల పంట రుణాలను మాఫీ చేసేందుకు డీఎంకే ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలో రావడానికి అలవిగాని హామీలతో ప్రజలను నమ్మించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఎంకే... ఈ నాలుగేళ్ల పాలనలో హామీలను సక్రమంగా నెరవేర్చలేదన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన మంత్రివర్గం ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని పక్కనబెట్టిందన్నారు. శాంతిభద్రతలు క్షీణించాయని, మరోవైపు మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోయిందన్నారు. ముఖ్యంగా అత్యాచార ఘటనలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తొలి సంతకం రైతుల రుణమాఫీపైనే అని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. దీంతో ఎంతోమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇప్పటికైనా రైతు రుణమాఫీపై కమిటీ వేసి చిన్న, సన్నకార రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

తండయార్‌పేటలో రాత్రి బడికి శంకుస్థాపన



రాత్రి బడికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ ఆర్. ప్రియ, శాసనసభ్యుడు ఆర్టీ శేఖర్ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో తండయార్‌పేట జోన్ 44వ వార్డు పాఠశాల వీధి కక్కన్‌జీ కాలనీలో గురువారం ఉదయం రూ.50లక్షలతో నిర్మించనున్న రాత్రి బడికి మేయర్ ఆర్ ప్రియ శంకుస్థాపన చేశారు. ఈ పాఠశాలతోపాటు విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని కూడా నిర్మించనున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు ఆర్టీ శేఖర్, కార్పొరేషన్ నార్త్‌జోన్ డిప్యూటీ కమిషనర్ కేజే ప్రవీణ్‌కుమార్, స్టాండింగ్ కమిటి (పన్నుల విధింపు) అధ్యక్షురాలు సర్ఫ్‌జ యాదాస్, జోనల్ కమిటీ అధ్యక్షుడు నేతాజీ యు గణేషన్ తదితరులు పాల్గొన్నారు.

మత ఘర్షణలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన బీజేపీ సీనియర్ నేత హెచ్ రాజాపై కేసు

ప్యారీస్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో మత ఘర్షణలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన బీజేపీ సీనియర్ నేత హెచ్.రాజాపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తిరుప్పరంకుండ్రం కొండపైవున్న సుబ్రమణ్యస్వామి ఆలయప్రాంగణంలో ఇటీవల మాంసాహారం పంపిణీ చేసిన వ్యవహారం కలకలంరేపింది. ఈ చర్యలను ఖండిస్తూ పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 4న ధర్నా నిర్వహించనున్నట్లు హిందూ మున్నాని సంస్థ ప్రకటించింది. అయితే తిరుప్పరంకుండ్రం పోలీసులు ధర్నాకు అనుమతి జారీచేయకుండా మదురై జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమలు చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించి ధర్నాలో పాల్గొన్న ఆందోళనాకారులను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా మదురైకు చెందిన సుందర వడివేలు మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో 144 సెక్షన్‌కు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేశారు. అదే సమయంలో ధర్నాలను అనుమతించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం మదురై పళంగానత్తంలో సాయంత్రం 5నుంచి 6గంటల వరకు మాత్రమే ధర్నా నిర్వహించుకునేలా ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు భద్రత నడుమ ఒక మైక్‌ను వినియోగించుకోవాలని, ఇతర మతాలను కించపరచకుండా నినాదాలు ఉండాలని, ధర్నాను వీడియోలో రికార్డు చేయాలని న్యాయస్థానం నిబంధనలు విధించింది. పళంగానత్తంలో హిందూ మున్నాని ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న హెచ్.రాజా మత ఘర్షణలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడడంతో ఆయనపై కేసు నమోదు చేశారు.

సీమాన్‌కు హైకోర్టులో చుక్కెదురు

ప్యారీస్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని దేశద్రోహి గా అభివర్ణించి ఘర్షణలకు దారితీసే విధంగా వ్యాఖ్యానించిన కేసు నుంచి తనకు విముక్తి కల్పించాలన్న నామ్ తమిళర్ కట్చి ఆర్గనైజర్ సీమాన్ కోరికను మద్రాస్ హైకోర్టు తిరస్కరిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2021వ సంవత్సరం విక్రవాండి శాసన సభ నియోజకవర్గ ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్న సీమాన్... దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని దేశద్రోహి అని వ్యాఖ్యానించినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు ఆధారంగా కంజనూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. విక్రవాండి కోర్టులో విచారణ స్థాయిలోవున్న ఈ కేసు నుంచి తనకు విముక్తి కల్పించాలని సీమాన్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి వేల్ మురుగన్ ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్, తుది విచారణ నివేదిక, సాక్షుల వాగ్మూలం ద్వారా సీమాన్‌పై మోపిన నిందపై ఆధారాలు ఉన్నాయని తెలిపిన న్యాయమూర్తి, సీమాన్ కోరికను తోసిపుచ్చారు. అంతేకాకుండా ఈ కేసు విచారణకు నేరుగా హాజరుకావాల్సిందేనని సీమాన్‌కు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.



ఉత్సవమూర్తులకు దీపారాధన

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



తిరుత్తణి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో తైమాస వేడుకలు వైభవంగా జరుగుతుంటాయి. తై మాస కృతిక సందర్భంగా గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. క్యూలైన్లలో భక్తులు వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకోవాల్సిన భక్తులు పాలు, పుష్పకావళ్లతో పాదయాత్రగా ఆలయానికి తరలివచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు తెలిపింది.

నొలంబూర్: ఎస్బీ గార్డెన్, వీజీఎన్ మాంటేకార్లో, ఎస్ఆర్ఆర్ నగర్, రాజా గార్డన్ ప్రాంతం, గురుసామి రోడ్డు, నొలంబూర్ ఫేస్-1,2, యూనియన్ రోడ్డు, వీజీఎన్ నగర్ 1 నుంచి 4, 1 నుంచి 8 బ్లాక్‌లు, కంభర్ రోడ్డు, కవిమణి రోడ్డు, భారతి రోడ్డు, అన్నామలై అవెన్యూ, మీనాక్షి అవెన్యూ, రెడ్డిపాళయం అవెన్యూ, ఎంసీకే లేఔట్, ఎంజీఆర్ యూనివర్శిటీ, పానన్‌సోలై వీధి, మాతా ఆలయ ప్రాంతం, పెరుమాళ్ ఆలయ ప్రాంతం, గజలక్ష్మి నగర్, వేంబులి అమ్మన్ ప్రాంతం, శ్రీరామ్ నగర్, పచ్చయప్పన్ నగర్, శక్తి నగర్, పాడసాలై రోడ్డు

అయ్యపాక్కం: టీఎన్‌హెచ్‌బీ ఫ్లాట్ 1 నుంచి 8,000, వీఐపీ బాక్స్ కొట్టిమేడు, కొల్లకాల క్యాంప్, రాజా అమ్మాళ్, కామరాజర్ నగర్, సెయింట్ పీటర్స్ కాలేజ్ రోడ్డు, టీఎన్‌హెచ్‌బీ 608 ఫ్లాట్స్

కానవూరు: సిరుగళత్తూర్, కెలిత్‌పేట, నందంబాక్కం, పెరియార్ నగర్, అంజుగం నగర్, మలయంబాక్కం, కుండ్రత్తూర్, బజార్ వీధి, మెహతా నగర్, మానన్‌చేరి జీ స్క్వేర్

మనపాక్కం: ఆర్ఈ నగర్ 5 నుంచి 9 వీధులు, కృష్ణా నగర్, దురైసామి నగర్, రామకృష్ణ నగర్ అనెక్స్, కుండ్రత్తూర్ మెయిన్ రోడ్డు కొంత భాగం, సిద్ధార్థ అపార్ట్‌మెంట్

సిరుసేరి: హీరానందిని అపార్ట్‌మెంట్, ఒలంపియా అపార్ట్‌మెంట్, నావలూరు, సిరుసేరి సిప్కాట్ ఐటీ పార్క్, తాలంబూర్, సిరుసేరి, ఓఎంఆర్ రోడ్డు, సిప్కాట్, పుదుపాక్కం, ఆరిహంట్ అపార్ట్‌మెంట్, వానియంచావిడి, కలిపత్తూర్, జేజే నగర్, ముత్తమ్మనగర్, ఆనంద్ ఇంజనీరింగ్ కాలేజ్, శ్రీనివాస నగర్, పడూర్

సోత్తుపెరుంబేడు: గిరుదలపురం, బుదూర్, అరుమంద్రై, వీచూర్, మేట్టుపాళయం, కండిగై, వెల్లివాయల్

తిరువేర్కాడు: దేవి నగర్, భాగ్యలక్ష్మి నగర్, పులియంబేడు పెద్ద వీధి, నూంబల్ మెయిన్ రోడ్డు, పీహెచ్ రోడ్డు, ఐశ్వర్య గార్డన్, పొన్నియమ్మన్ నగర్ రాజన్‌కుప్పం, మెట్రో సిటీ ఫేస్-1 మహాలక్ష్మి నగర్, యాదవాల్ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, పాదసాలై వీధి, చెన్నై న్యూ సిటీ, రాజీవ్‌గాంధీ నగర్, చెట్టి మెయిన్ రోడ్డు, పెరుమాళ్ ఆలయ వీధి, మేలాయనంబాక్కం, పద్మావతుఅమ్మన్ ఆలయ వీధి, ఈడెన్ అవెన్యూ, విజయ నగర్, సరస్వతి నగర్, శ్రీనివాస పిళ్లై వీధి, పచ్చియప్పన్ నగర్, కొన్‌రాజకుప్పం, లోటస్ అవెన్యూ, సేవా, ఆర్డీఎల్ నగర్, పెరుమాళ్ ఆలయ వీధి, కోలాడి.

అలంగానల్లూరు హైస్కూలుకు బాంబు బెదిరింపు



స్కూలు నుంచి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అలంగానల్లూరు సమీపంలోని ఓ ప్రైవేట్ మహోన్నత పాఠశాలకు గుర్తు తెలియని వ్యక్తులు బాంబు బెదిరింపులకు పాల్పడటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ విషయం తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాలకు చేరుకుని తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. అలంగానల్లూరు సమీపం పాపాక్కుడిలో ఉన్న ఆ పాఠశాలలో సుమారు 2000 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ఆ స్కూలులో బాంబులు పెట్టి ఉన్నామని, త్వరలో అవి పేలనున్నాయని బెదిరిస్తూ ఈ మెయిల్ పంపారు. పాఠశాల నిర్వాహకులు ఆ విషయాన్ని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలంగానల్లూరు పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ తో అక్కడికి చేరుకున్నారు. తరగతుల్లో ఉన్న విద్యార్థులను బయటకు పంపి ప్రతి గదిని మెటల్ డిటెక్టర్లతో, పోలీసు జాగిలంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చివరకు ఎక్కడా బాంబులు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ మెయిల్ పంపిన వారికోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కురింజి కొండపై అగ్నిప్రమాదం

● నాలుగు ఎకరాల్లో వన సంపద దగ్ధం



కొండపై చెలరేగుతున్న మంటలు

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కున్నూర్ ఓదనట్టి సమీపంలోని కురింజి కొండల్లో ఏర్పడిన అగ్ని ప్రమాదంలో, నాలుగు ఎకరాల వన సంపద దగ్ధమైంది. నీలగిరి జిల్లాలోని కురింజి కొండ ప్రాంతంలో సైనిక కేంద్రం రైఫిల్ షూటింగ్ శిక్షణా కేంద్రముంది. ఈ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి హఠాత్తుగా మండలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో గాలులు వీస్తుండడంతో మంటలు వేగంగా చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, సైనికులు సంయుక్తంగా మంటలు ఆర్పే పనులు చేపట్టారు. బుధవారం సాయంత్రం వరకు శ్రమించి మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో 4 ఎకరాల్లో వన సంపద దగ్ధమైందని, ఈ ప్రమాదానికి కారుకులైన వారు ఎవరా అని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాన్ బోల్తా: చెల్లాచెదురైన చేపలు
ఏరుకునేందుకు పోటీపడ్డ జనం



బోల్తాపడిన వ్యాన్ వద్ద చేపలను ఏరుకుంటున్న జనాలు

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా అగరంచేరి చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలో గురువారం ఉదయం చేపలలోడు వ్యాన్ టైర్ పంక్చరై బోల్తా పడింది. ఆ వ్యాన్‌నుంచి మేలిమి రకం చేపలన్నీ రోడ్డుపై పడటంతో వాటిని ఏరుకోవడానికి స్థానికులు పోటీపడ్డారు. నామక్కల్ జిల్లా పళ్ళిపాళయానికి చెందిన నటరాజన్(28) విజయవాడ నుంచి కృష్ణగిరి రెండు టన్నుల మేలిరకం చేపల పార్శిళ్లను వ్యాన్‌లో ఎక్కించుకుని బయలుదేరాడు. గురువారం ఉదయం ఆ వ్యాన్ వేలూరు జిల్లా పళ్ళికొండ సమీపం అగరంచేరి చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలో వెళుతుండగా టైర్ పంక్చరైంది. దీంతో ఆ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు మధ్యలో బోల్తాపడింది. వ్యాన్‌లో థర్మాకోల్ పెట్టెల్లో ఉన్న మేలిరకం చేపలన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. స్థానికులు గమనించి వెంటనే తమ ఇళ్లకు వెళ్ళి సంచులు, స్టీల్ పాత్రలతో తిరిగొచ్చి రోడ్డుపై పడిన చేపలను జవురుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వెంటనే సోషల్‌మీడియాలో వెలువడటంతో పళ్ళికొండ పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లారు. చేపలను ఏరుకుంటున్న స్థానికులను తరిమికొట్టారు. ఈ సంఘటన కారణంగా ఆ మార్గంలో గంటకు పైగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పంచాయతీలకు క్రీడా సామగ్రి వితరణ



క్రీడా సామగ్రి అందజేస్తున్న అధికారులు

వేలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుడి యాత్తం యూనియన్ లోని 50 పంచాయతీ లకు క్రీడా ఉపకర ణాలను అందించారు. కార్యక్రమానికి బీడీఓ శరవణన్ అధ్యక్షత వహించగా, బీడీఓ అముదవల్లి ఆహ్వానం పలికారు. గుడియాత్తం యూనియన్ కమిటీ అధ్యక్షుడు సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొని, పంచాయతీల నిర్వాహకులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షులు అఖిలాండేశ్వరి, ప్రేమ్‌కుమార్, సుబ్రమణి, రమేష్‌కుమార్, ఎన్.బాబు, బీడీఓ కార్యాలయ మేనేజర్ లోకేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీపురం శ్రీ నారాయణి ఆస్పత్రి లో గత వారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు క వితలు, డ్రాయింగ్ సహా పలు పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీల్లో విజే తలకు బహుమతులు అందించే కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజి, అమెరికాకు చెందిన శక్తిఅమ్మ భక్తుడు కౌతికైనార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప వైద్య సూపరింటెండెంట్ రాజీవ్‌గాంధీ, క్యాన్సర్ చికిత్స నిపుణుడు ప్రసాద్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఇయక్కం టాలెంట్ టెస్ట్




టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

వేలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సైన్స్ ఇయక్కం ఆధ్వర్యంలో స్థానిక తుళిర్ పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 4, 5 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఇయక్కం అధ్యక్షురాలు, లెక్చరర్ అముద, జాయింట్ సెక్రటరీ కోటేశ్వరి, సెక్రటరీ జనార్దనన్, ఉపాధ్యక్షుడు విశ్వనాథన్, వేలూరు శాఖ సెక్రటరీ ముత్తు, కోశాధికారి శేఖర్, ప్రధానోపాధ్యాయులు సౌందర్య, మోహనప్రియ, పాఠశాల కరస్పాండెంట్ కనక సహా పలువురు పాల్గొన్నారు. టెస్ట్‌లో ప్రతిభ చూపిన వారికి నిర్వాహకులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

భక్తుల కోర్కెలు తీర్చే పుణ్యస్థలం

సిద్ధపురుషుల అనుగ్రహ క్షేత్రం

● శీర్గాళి సిట్రంబల నాడిగళ్ ఆలయం



టి.నగర్, ఆంధ్రజ్యోతి

సుప్రసిద్ధ ప్రాచీన ఆలయాల్లో ప్రత్యేకించి శివాలయాల్లో సిద్ధపురుషుల సమాధులు కూడా ఉంటాయి. అళగర్‌మలైలో రామదేవర్, తిరువనంతపురంలో కుంభముని, తిరువణ్ణామలైలో ఇడైక్కాటర్, విరుదాచలంలో పాంబాట్టి సిద్దర్, మైలాడుదురైలో కుదుంబై సిద్దర్, తిరువారూరులో కమలముని, వైదీశ్వరన్ కోవిల్‌లో ధన్వంతరి, పళనిలో బోగర్, తిరుప్పరంకుండ్రంలో మత్స్యముని, రామేశ్వరంలో పతంజలి, కాశీలో నంది, శ్రీరంగంలో జరాముని ఇలా సిద్ధపురుషులు భక్తులను సూక్ష్మరూపంలో అనుగ్రహిస్తున్నారు. అయితే ఓ సిద్ధ మహాపురుషుడు తన 63 మంది శిష్యులతో కలిసి ఒకే చోట జీవ సమాధినొంది భగవంతుడిలో ఐక్యమైన అరుదైన క్షేత్రమే శీర్గాళి సిట్రంబల నాడిగళ్ ఆలయం.





ఆలయ ప్రవేశ ద్వారం - మహావిష్ణువు సన్నిధి

ఆవిర్భావం...

చోళవళనాడులోని శీర్గాళి శైవ వేళాన్‌కుడి వంశంలో జన్మించిన కాళి సిట్రంబల నాడిగళ్ 14వ శతాబ్దానికి చెంది సిద్ధపురుషుడు. తిరుచెందూరు సెందిల్ ఆండవర్ ఆలయానికి వెళ్లి స్వామివారిని సేవిస్తూ స్వామివారి అనుగ్రహం కోసం తపస్సు చేశారు. అతడి తపస్సును మెచ్చి సెందిల్ ఆండవర్ ప్రత్యక్షమై జ్ఞానాన్ని అనుగ్రహించారు. ఆ తరువాత మైలాడుదురైలో మఠం నిర్మించుకుని అక్కడే బస చేశారు. ధర్మపురం ఆధీనం మొదటి గురువులైన తిరుజ్ఞాన సంబందర్ గురుపరంపరలో ఆద్యుడు ఈ కాళి సిట్రంబల నాడిగళ్. ఆ సిద్ధపురుషుడికి 63 మంది ప్రత్యేక శిష్యులున్నారు. ఓ రోజు సిట్రంబల నాడిగళ్ తన శిష్యగణంతో తిరుమఠంలో ప్రసాద స్వీకరణకు కూర్చున్నారు. ఆ సమయంలో మఠం సిబ్బంది వేడి అన్నంలో నేతికి బదులు వేపనూనె వేశారు. సిట్రంబల నాడిగళ్, ఆయన శిష్యులు మామూలుగానే భోజనం చేశారు. అయితే ఆ 63 మంది శిష్యుల్లో ఒకడైన కన్నప్పర్ నేతికి బదులు వేపనూనె వేశారంటూ గురువుకు ఫిర్యాదు చేశాడు. వెంటనే సిట్రంబల నాడిగళ్ 'మన శిష్యగణంలో ఇంకా పరిపక్వత చెందని శిష్యులున్నారు' అన్నారు. వెంటనే కన్నప్పర్ తన తప్పు తెలుసుకుని మఠం విడిచి తన గురువును తలచుకుంటూ ఉత్తరాదికి వెళ్ళి తపస్సు చేశారు.



ఆలయ వైభవం గురించి తెలిపే ప్రాచీన శిలాశాసనం

జీవ సమాధి ఏర్పాట్లు...

ఎన్నో ఏళ్లపాటు శిష్యులకు జ్ఞానోపదేశం చేసిన సిట్రంబల నాడిగళ్ జీవసమాధితో ముక్తి నొందాలని భావించారు. ఆ విషయాన్ని తన శిష్యులకు తెలుపగానే గురువును విడిచి జీవించలేమని, ఆయనతోనే తామంతా జీవ సమాధి అవుతామని ప్రకటించారు.ఆ ప్రాంతాన్ని పాలిస్తున్న చోళచక్రవర్తి దగ్గరకు వెళ్లి తామంతా జీవసమాధి చెందడానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఆ మేరకు మైలాడుదురైకి పడమటి దిశగా కావేరి నదీతీరంలో ఉద్యానవనాన్ని సిద్ధపురుషుల జీవసమాధికి అనువైన ప్రాంతంగా ప్రకటించి చోళచక్రవర్తి కేటాయించారు. తామంతా ముక్తినొందిన తర్వాత అక్కడ తమ సమాధి ఆలయాలు నిర్మించమని సిట్రంబల నాడిగళ్ చెప్పారు. చోళ చక్రవర్తి ఏర్పాట్లు చేపట్టాక పుర ప్రజల సమక్షంలో చైత్రమాసం శ్రవణా నక్షత్ర పుణ్యదినాన సిట్రంబల నాడిగళ్ తన 62 మంది శిష్యులతో జీవసమాధినొందారు. ఈ విషయం ఉత్తరాదిలో తపస్సు చేస్తున్న మరో శిష్యుడు కన్నప్పర్‌కు తెలిసింది. కన్నప్పర్ మైలాడుదురైకి వచ్చి తన గురువు సమాధిపై పడి విలపించాడు. అతడి దుఃఖాన్ని చూసి సిట్రంబల నాడిగళ్ సమాధి నుండి బయటకు వచ్చి కన్నప్పర్‌కు ముక్తి ప్రసాదించారు. ఇలా ఒకే చోట సిట్రంబల నాడిగళ్ తన 63 మంది శిష్యులతో జీవసమాధినొందిన ప్రాంతం ప్రస్తుతం శీర్గాళి సిట్రంబల నాదర్ ఆలయంగా పేరుగడించింది. సిద్ధపురుషులు సమాధి చెందిన వనం కనుక ఈ ప్రాంతాన్ని తమిళంలో 'సిద్దర్‌కాడు' అని పిలుస్తున్నారు.

ఆధ్యాత్మికం



శివయోగ నాయకి అమ్మవారు

ఆలయ వైభవం...

ఈ ఆలయానికి తూర్పున ప్రవేశ ద్వారం ఉంది. ముఖ మండపాన్ని దాటి వెళితే గర్భాలయంలో క్షేత్రపురుషుడైన కాళి సిట్రంబల నాడిగళ్ సమాధి, దానిపైన శివలింగం దర్శనమిస్తాయి. గర్భాలయం చుట్టూ 63 మంది శిష్యులు ఐక్యమొందిన సంఘటన తెలిపేలా దక్షిణామూర్తి సన్నిధికి చేరువగా 63 శివలింగ తిరుమేనులు కనిపిస్తాయి. గర్భాలయం వెనుక వినాయకుడు, కాశీ విశ్వనాథుడు, విశాలాక్షి, మహాలక్ష్మి, సప్తపీఠాలు, శనీశ్వరుడు, సూర్యభగవానుడు, భైరవుడు, నవగ్రహ సన్నిధులున్నాయి. అమ్మవారు 'శివయోగ నాయకి'పేరుతో ప్రత్యేక సన్నిధిలో పూజలందుకుంటున్నారు.

నవగ్రహాల సన్నిధి



ఆలయ విశేషాలు.. : ఈ ఆలయంలో ప్రతియేటా చైత్రమాసం శ్రవణ నక్షత పర్వదినాన కాళి సిట్రంబల నాడిగళ్ గురుపూజ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇదే విధంగా ప్రతినెలా శ్రవణ నక్షత్రం రోజు ప్రత్యేక పూజలు జరుపుతారు. పౌర్ణమి, అమావాస్య, ప్రదోష రోజుల్లో ప్రత్యేక ఆరాధన, అభిషేకాలు జరుగుతాయి. ఈ ఆలయాన్ని దర్శిస్తే వివాహయోగం, సంతానభాగ్యం, సంపూర్ణ ఆరోగ్య ప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఎక్కడుందీ ఆలయం? : నాగపట్టినం జిల్లా మైలాడుదురై రైల్వే స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఈ శైవక్షేత్రం ఉంది. మైలాడుదురై వెళ్లడానికి ప్రధానమైన నగరాల నుంచి బస్సులున్నాయి. మైలాడుదురై రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ నుంచి ఆటోలు, షేర్ ఆటోలు, టాక్సీల్లో ఈ ఆలయాన్ని చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



శివయోగ నాయకి అమ్మవారి సన్నిధి

రెండేళ్ళ తర్వాత అజిత్ ఫ్యాన్స్ సంబరాలు





రోహిణి థియేటర్ వద్ద అభిమానుల కోలాహలం



అజిత్ కటౌట్‌కు పూలమాలలు వేస్తున్న అభిమానులు - కటౌట్‌కు అభిమానుల పాలాభిషేకం

● ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన 'విడాముయర్చి' ● కటౌట్లకు పాలాభిషేకాలు

తమ అభిమాన హీరో అజిత్‌కుమార్ నటించిన చిత్రం రెండేళ్ల తర్వాత విడుదల కావడం తో ఆయన అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. సినిమా విడుదలైన థియేటర్ల వద్ద సందడి చేస్తున్నారు. అజిత్ నటించిన 'విడాముయర్చి' గురువారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది.దీంతో థియేటర్ల వద్ద అజిత్ ఫ్యాన్స్ భారీ కటౌట్లు, బ్యానర్లు కట్టి పాలాభిషేకాలు చేశారు. మరికొందరు అభిమానులు సినిమా హిట్ కావాలని కోరుతూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.అజిత్ నటించిన 'తుణివు' 2023 లో విడుదలైంది. గత యేడాది ఒక్క సినిమా కూడా విడుదలకాలేదు. దీంతో తమ హీరో సినిమా ఎప్పుడు విడుదలవుతుందా అంటూ అభిమానుల ఎదురు చూపులకు ఎట్టకేలకు తెరపడింది.ఈ సినిమా మొదటి ఆటను రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 9 గంటలకు ప్రదర్శించారు. ఉదయం 8 గంటలకే థియేటర్లకు చేరుకున్న అభిమానులు బాణసంచా కాల్చుతూ, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

ప్రేక్షకులతో సినిమా చూసిన త్రిష

ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన త్రిష.. చెన్నైలోని ఓ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమా చూశారు. అలాగే, మరో హీరోయిన్ రెజీనా కెసాండ్రా, సంగీత దర్శకుడు అనిరుద్ రవిచందర్‌తో పాటు అజిత్ తదుపరి చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'కి దర్శకత్వం వహిస్తున్న ఆధిక్ రవిచంద్రన్, ఈ సినిమాలో మరో కీలక పాత్రను పోషించిన అర్జున్ దాస్ సినిమాను చూసిన వారిలో ఉన్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చితానికి మగిళ్ తిరుమేని దర్శకుడు. యాక్షన్ కింగ్ అర్జున్ ప్రధాన విలన్‌గా నటించగా ఆయన ప్రియురాలిగా రెజీనా, సభ్యుడిగా ఆరవ్ నటించారు.

కార్తి చిత్రంలో తొలిసారి వడివేలు

హీరో కార్తి చిత్రంలో హాస్యనటుడు వడివేలు తొలిసారి నటించనున్నారు. దాదాపు దశాబ్దం పాటు వెండితెరకు దూరంగా ఉంటూ వచ్చిన వడివేలు 'నాయ్ శేఖర్ రిటర్న్స్' మూవీ ద్వారా రీఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత హీరో ఉదయనిధి నటించిన 'మామన్నన్'లో లీడ్ రోల్ పోషించారు. ఆ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రస్తుతం ఫహద్ ఫాజిల్‌తో కలిసి 'మారీశన్' అనే సినిమాలో నటిస్తుండగా, త్వరలోనే విడుదలకానుంది. ఆ తర్వాత సుందర్ సి డైరెక్షన్‌లో నటించనున్నారు. ఇదిలావుండగా, కార్తి ప్రస్తుతం 'సర్దార్-2'లో నటిస్తున్నారు. దీని తర్వాత తన 29వ చిత్రాన్ని 'టాణాక్కారన్'ను తమిళ్ దర్శకత్వంలో తెరకెక్కించనున్నారు. ఇందులో వడివేలు నటించనున్నారు. ఇందులో హాస్యపాత్ర కాకుండా కీలకమైన పాత్రను పోషించనున్నట్టు సమాచారం.



వడివేలు - కార్తి

తమన్నా హ్యాండ్‌బ్యాగ్ ధర అంతనా?

తమిళ చిత్రజ్యోతి

చిత్రపరిశ్రమలో అగ్రనటిగా కొనసాగుతున్న హీరోయిన్ తమన్నా. ఈమెకు హ్యాండ్‌బ్యాగుల పిచ్చి అధికమనే టాక్ ఉంది. అందుకే మార్కెట్‌లోకి కొత్త హ్యాండ్‌బ్యాగ్ వస్తే దాన్ని కొనుగోలు చేసేస్తుంటారు.దాని ధర రూ.లక్షల్లో ఉన్నప్పటికీ ఆమె ఏమాత్రం లెక్క చేయరు.తాజాగా ఆమె హ్యాండ్ బ్యాగ్‌పై ఇపుడు చర్చ సాగుతోంది. తమన్నా చేతిలో ఉండే హ్యాండ్‌బ్యాగ్ ధర సుమారుగా రూ.3.30 లక్షలంటూ ప్రచారం సాగుతోంది. ఈ ఖరీదైన ఈ లగ్జరీ హ్యాండ్‌బ్యాగ్‌ను తమన్నా ధరించివుండగా తీసిన ఫొటోలు ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, తమిళం, తెలుగు, హిందీ భాషల్లో నటిస్తున్న తమన్నా ఎంతో బిజీగా ఉన్నారు. ఇదిలావుండగా, కేరళలో 9వ తరగతి విద్యార్థి మిహిర్ అనే బాలుడుని ర్యాగింగ్ పేరుతో చిత్రహింసలు పెట్టి ఆత్మహత్య చేసుకునేలా ప్రోత్సహించిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు.



కొత్త హ్యాండ్‌బ్యాగ్‌తో తమన్నా

న్యాయమూర్తిగా సోనియా అగర్వాల్

హీరోయిన్ సోనియా అగర్వాల్ న్యాయమూర్తి పాత్రలో కనిపించనున్నారు. కొత్తారి మద్రాస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో ఫూట్ స్టెప్స్ ప్రొడక్షన్ పతాకంపై డైరెక్టర్ శివరామన్ దర్శకత్వంలో రూపొందే 'విల్' మూవీలో ఆమె జడ్జిగా నటించనున్నారు. ఫుల్‌లెంగ్త్ కోర్టు డ్రామాగా ఈ మూవీ తెరకెక్కనుంది. ఇందులో సోనియా అగర్వాల్ సహా విక్రాంత్ నటించనున్నారు. చిత్రీకరణ పనులు తుదిదశకు చేరుకోగా, ఫస్ట్‌లుక్, ఫస్ట్‌సింగిల్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'ఒక ఇంట్లో ఒక వీలునామా (విల్) సృష్టించిన సమస్య కోర్టు కేసుగా మారుతుంది. ఆ కేసు ఏమైంది? వీలునామా వెనుక ఉన్న త్యాగం ఏమిటి? అనేదే ఈ చిత్ర స్టోరీ. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను కూడా పూర్తి చేసుకుని త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని వివరించారు.



తిరుప్పరంకుండ్రంలో వైభవంగా వజ్రాల రథోత్సవం



వజ్రాల రథాన్ని లాగుతున్న భక్తులు

చెన్నై,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం ఆలయంలో గురువారం ఉదయం తైమాస తెప్పోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వజ్రాల రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ తెప్పోత్సవాలు జనవరి 29న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ప్రతిరోజూ స్వామివారు దేవయాని సమేతుడై స్వర్ణ సప్పరం, స్వర్ణ మయూర, వెండి భూత వాహనం, హంస వాహనం, శేష వాహనాల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో కీలకఘట్టమైన వజ్రాల రథోత్సవం కనులపండువగా జరిగింది. వేకువజామున ఉత్సవర్ల సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి, దేవయాని అమ్మవారికి పాలు, చందనం సహా 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత సర్వాలంకరణ శోభితులై జీఎస్టీ రోడ్డులో తీర్థకొలను వద్ద వేంచేపు చేశారు. అటు పిమ్మట 16 కాళ్ల మంటపం వద్దనున్న వజ్రాల రథంలో ఆశీనులయ్యారు. భక్తులు ఇరువైపులా నిలిచి తాళ్లను పట్టుకుని లాగుతూ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలలో ఆలయ ట్రస్టు బోర్డు అధ్యక్షుడు సత్యప్రియా బాలాజి, ట్రస్టీలు షణ్ముగసుందరం, మణిసెల్వన్, బొమ్మెదేవన్, రామయ్య, ఆలయ డిప్యూటీ కమిషనర్ సూర్యనారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

'తంగిరాల' సాహితీ సేవ మరువలేనిది

డాక్టర్ నిర్మలా పళనివేల్



తంగిరాలకు నివాళులర్పిస్తున్న జనని నిర్వాహకులు

అడయార్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గత నెలలో భౌతికంగా దూరమైన ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు సంతాప సభ స్థానిక వ్యాసర్‌పాడి ఎంకేబీ నగర్‌లో గురువారం జరిగింది. జనని సాంఘిక సాంస్కృతిక సమితి నిర్వహించిన ఈ సభలో పాల్గొన్నవారు తంగిరాల చిత్రపటానికి పుష్పాంజలితో నివాళులర్పించారు. ఈ సంతాప సభలో పాల్గొన్న జనని అధ్యక్షురాలు డాక్టర్ నిర్మలా పళనివేల్ ఈ సందర్భంగా తంగిరాలను స్మరించుకుంటూ ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ముఖ్యంగా తంగిరాల చేసిన సారస్వత సంసేవనం వల్ల నిరంతరం మన హృదయాల్లో నిలిచి ఉన్నారన్నారు. ముఖ్యంగా కవిధారణ, జానపద సంస్కృతిని నిలబెట్టడానికి ఆయన చేసిన సేవ అమూల్యమైనదన్నారు. రేనాటి సూర్యచంద్రులు జానపద సాహిత్యం - వీర గాథలు' వంటి ఆయన రచనలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. అటువంటి సాహితీ ప్రియులు, సాహితిస్రష్ట తంగిరాల ఆత్మకు శాంతి కలగాలని ఆమె ప్రార్థించారు. ఈ సభలో పాల్గొన్న జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య చేసిన ప్రసంగంలో తంగిరాల గుణగణాలను, తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి చేసిన సేవలను వివరించారు. అదేవిధంగా, రాష్ట్ర విద్యాశాఖ మాజీ సంచాలకులు డాక్టర్ సి.పళనివేల్.. తంగిరాలతో తనకున్న అనుబంధాన్ని ఓసారి నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముత్తురామన్‌తోపాటు అనేక మంది పాల్గొని తంగిరాలకు నివాళులు అర్పించారు.

గొల్లపల్లి చంద్రమ్మ సేవలు చిరస్మరణీయం

- సంస్మరణ సభలో వక్తలు -



గొల్లపల్లి చంద్రమ్మ చిత్రపటాన్ని ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, తెలుగు ప్రముఖులు

ప్యారీస్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టాప్స్) వ్యవస్థాపకుడు, జనోదయం డైరెక్టర్ డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు మాతృమూర్తి దివంగత గొల్లపల్లి చంద్రమ్మ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. జనవరి 23న వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా మృతిచెందిన చంద్రమ్మ ఆదరణ కూడిక (సంస్మరణ సభ) గురువారం కీల్పాక్కంలో టీపీసత్రం అన్నా కమ్యూనిటీ హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆవిష్కరించిన ఆమె చిత్రపటానికి కుమారులు గొల్లపల్లి ఇశ్రాయేలు, ఆశీర్వాదం, కుమార్తెలు కె.సంపూర్ణమ్మ, ఎం.సారమ్మ, కోడళ్లు, అల్లుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు, రెవరెండ్ డాక్టర్ ఎస్ ప్రకాశ్‌రాజ్, రెవరెండ్ డాక్టర్ బొటుమంచి హానోక్ జాన్‌వెస్లీ, బిషప్‌లు దేవదాస్ పాత్ర, ఏబేలు నీలకంఠన్, లెఫ్టినెంట్ కల్నల్ జాన్ విలియమ్స్, ఎలీషాకుమార్, టాప్స్ అధ్యక్షుడు నేలటూరి విజయ్‌కుమార్ సహా, తెలుగు సంఘాల పాస్టర్లు, శ్రేయోభిలాషులు, బంధువులు, టాప్స్ నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ సభలో మాట్లాడిన వక్తలు మనిషి విలువ అతను చేసే సేవా కార్యక్రమాల ద్వారా స్పష్టమవుతుందని, పరుల సంక్షేమం కోసం జీవించేవారు చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. ఈ సిద్ధాంతాలతో జీవించిన తల్లి చంద్రమ్మ పెంపకంలో శ్రద్ధగా చదువుకున్న గొల్లపల్లి ఇశ్రాయేలు బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని, అరుంధతీయుల హక్కుల కోసం పోరాడి, ఎట్టకేలకు ప్రభుత్వాన్ని మెప్పించి 3శాతం రిజర్వేషన్ సాధించారన్నారు. సమాజసేవలో రాణిస్తున్న ఇశ్రాయేలు అమెరికాలోని ఐక్యరాజ్య సమితిలో నిర్వహించిన 16రోజుల సమావేశంలో పాల్గొని అణగారిన వర్గాల సమస్యలపై ప్రసంగించారని అలాగే పలు దేశాల్లో పర్యటించి దళిత వర్గాల సమస్యలను పరిష్కరింపజేశారని వక్తలు అన్నారు.

ఘనంగా సీబీఎఫ్ సంఘ 32వ వార్షికోత్సవం

ప్యారీస్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నైలోని కొరుక్కుపేట, కామరాజర్ నగర్‌లోవున్న సీబీఎఫ్ సంఘ 32వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. సీబీఎఫ్ వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ టీవీ సువార్త ప్రసంగీకుడు రెవరెండ్ జడ వసంత్‌బాబు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కామరాజర్‌నగర్, న్యూ శాస్త్రినగర్, జేజేనగర్, చిగురింతపాళెం తదితర ప్రాంతాలకు చెందిన పేదలు, మహిళలు, వృద్ధురాళ్లు, వితంతువులకు వసంత్‌బాబు - విశ్వవాణి దంపతులు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వసంత్ బాబు మాట్లాడుతూ.. ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులే మిన్న అని సామాజిక సేవ చేయుట దేవునికి ప్రీతికరమన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో పాల్గొని విజేతలకు విశ్వ ఫౌండేషన్, సీబీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు.



మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న రెవరెండ్ జడ వసంత్‌బాబు - విశ్వవాణి దంపతులు

లిల్లీ, కార్నేశన్ పూలకు పెరిగిన గిరాకీ

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమికుల దినోత్సవం ఈనెల 14వ తేది జరుపుకోనున్న నేపథ్యంలో నీలగిరి జిల్లాలో బొకేల తయారీ ముమ్మరంగా సాగుతోంది. జిల్లాలోని కున్నూరు, కోత్తగిరి, ఊటీ తదితర ప్రాంతాల్లో సాగు చేస్తున్న పూలు బెంగళూరు, చెన్నై తదితర నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ విషయమై పూల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వాహిబ్ శేర్ మాట్లాడుతూ... ప్రేమికుల దినోత్సవం సందర్భంగా రోజా పూల ధర అధికంగా ఉంటుందన్నారు. రోజా పూలకు ప్రసిద్ధిగాంచిన హోసూరు, పరిసర ప్రాంతాల్లో మంచు కారణంగా పూల దిగుబడి తగ్గిందన్నారు. ఈ కారణంగా నీలగిరి జిల్లాలో లభించే లిల్లీ, కార్నేశన్, జెర్బరా తదితర పూలకు గిరాకి పెరిగిందన్నారు. 10 లిల్లీ పూలు కలిగిన ఏషియాటిక్ ఫ్లవర్ బొకే రూ.300, ఓరియంటల్ బొకే రూ.700, కార్నేశన్ రూ.200, గెర్బెరా పువ్వు రూ.4కు విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు.



బొకేలు సిద్ధం చేస్తున్న మహిళలు

తిరుమలలో దర్శకేంద్రుడు






రాఘవేంద్రరావు - శ్రీనివాస్‌రెడ్డి - పులివర్తి నాని, జగన్మోహన్ - వసంత కృష్ణప్రసాద్


తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, జగన్మోహన్, పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

12న రామకృష్ణతీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 12న రామకృష్ణతీర్థ ముక్కోటి జరుగనుంది. తిరుమల కొండల్లో పవిత్రమైన సప్తతీర్థాలుగా స్వామి పుష్కరిణి, కుమారధార, తుంబురు కోన, శ్రీరామకృష్ణ తీర్థం, ఆకాశగంగ, పాపవినాశనం, పాండవతీర్థంలను భావిస్తారు. ఇందులో ఒకటైన రామకృష్ణ తీర్థం తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో ఉంది. పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున ఈ తీర్థముక్కోటిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో ఆలయ మాడవీధుల గుండా పూలు, పండ్లు, స్వామి ప్రసాదాలతో శ్రీరామకృష్ణ తీర్థానికి వెళతారు. అక్కడున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు గనుక ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.2.97 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,600

తలనీలాలు సమర్పించినవారు: 19,083

అలుపన్నది ఉందా ఎగిరే అలకు..ఎదలోని లయకు అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ సినీగీతంలో..రిటైరైనా... ఏడు పదులు దాటినా టెన్నిస్ రాకెట్ వదలని వీరిని చూస్తే ఆ పాటలోని మాటలు వీరికీ వర్తిస్తాయి. వీరి ఉత్సాహం చూసి వయసే వెనుకడుగేస్తుందేమో అనిపిస్తుంది. వృద్ధాప్యం దూరంగా జరిగిపోతోంది. నిరాశ పటాపంచలవుతోంది. జీవిత చరమాంకంలోనూ తరగని క్రీడోత్సాహం ప్రదర్శిస్తున్న ఈ విశ్రాంత ఉద్యోగుల తీరు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమవుతుంది. విశ్రాంత జీవితమంటే కుర్చీలకు, మంచాలకు అంటిపెట్టుకుపోవడమని భావించేవారిని ఉత్సాహపరిస్తుంది. వయసుతో పనిలేకుండా ఆరోగ్యం కోసం ఇప్పటికీ ఆటలాడుతున్న వారిని చూస్తే ఔరా అనిపిస్తుంది. తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్,టౌన్‌క్లబ్‌ల్లో ఇలా టెన్నిస్ ఆడుతున్న కొందరు రిటైర్డ్ ఉద్యోగులను ఒకసారి పలుకరిద్దాం..

- తిరుపతి,క్రీడలు (ఆంధ్రజ్యోతి)

● ఏడు పదులు పైబడినా తరగని క్రీడోత్సాహం

మలిసంధ్యలో మళ్లీ ఆడేద్దాం

● విశ్రాంత జీవితంలో ఉల్లాసంగా..





లాన్‌టెన్నిస్ టోర్నీలో పాల్గొన్న వృద్ధ క్రీడాకారులు

రోగాలు దరిచేరవు....



నేను ఆంధ్రాబ్యాంకులో పనిచేసేవాడిని. మేనేజరు హోదాలో రిటైరయ్యాను. నాకు 76సంవత్సరాలు. చదువుకునే రోజుల నుంచి ఆటల్లో పాల్గొనేవాడిని. రిటైరయ్యాక పడక కుర్చీకి పరిమితం కావడం ఇష్టం లేదు. అందుకు ఆటను వదలలేదు. 60ఏళ్ల టెన్నిస్ ఆడుతున్నా, 40టోర్నమెంట్స్‌లో పాల్గొన్నాను. 18నేషనల్స్ టోర్నీలకు ప్రాతినిధ్యం వహించాను. బహుమతులు సొంతం చేసుకున్నా. రోజు ఏదో ఆటలాడితే అనారోగ్యం దరిచేరదు. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. అందరూ తీరిక సమయంలో క్రీడల్లో పాల్గొంటే చాలా మంచిది.

- ఎన్.సి.అశోక్‌రెడ్డి, తిరుపతి

ఒక్క రోజు మిస్సైతే ఏదో కోల్పోయినట్టుంది...



ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేసి రిటైరయ్యాను. నా వయసు 73ఏళ్లు. గడచిన 45 సంవత్సరాలుగా ఉదయం, సాయంత్రం స్నేహితులతో కలసి కనీసం రెండు గంటలపాటు టెన్నిస్ ఆడుతాను. రోజూ ఆడటం వల్లే యాక్టీవ్‌గా, ఫిట్‌గా ఉన్నానని నమ్ముతున్నా. షుగర్, బీపీలాంటివేవీ లేదు. ఎప్పుడైనా చిన్నపాటి దెబ్బలు తగలినా టెన్నిస్ వదల్లేదు. ఈ తరం పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెరగాలి. తల్లిదండ్రులు,స్కూలులో ఇందుకు ప్రోత్సహించాలి.

- హనుమంతరావు, తిరుపతి

రిటైర్మెంటు వయసుకు మాత్రమే..



ప్రొఫెసరుగా రిటైరయ్యాను. ఇప్పుడు 78ఏళ్లు. ఎప్పుడూ ఆధారపడే మనస్తత్వం ఉండకూడదనుకుంటాను. మనసులో ఉత్సాహం ఉంటే లైఫ్ బాగుంటుంది. ఇందుకు క్రీడలు బాగా సహకరిస్తాయి. నా విషయంలోనే ఇదే కరెక్టయింది. రోజూ గంటపాటు టెన్నిస్ ఆడుతా. వాస్తవానికి నేను ఆహారం విషయంలో పెద్దగా నియమాలను పాటించను. చలాకీగా ఉంటాను. రిటైర్మెంటు వయసుకే గాని మనసుకు కాదని నమ్ముతాను. ఇప్పటివరకూ ఎలాంటి అనారోగ్య సమస్య ఎదురుకాలేదు. నేటి యువత కూడా క్రీడలపట్ల శ్రద్ధ చూపాలి. చదువు, ఆటల వల్ల క్రమశిక్షణ అలవాటవుతుంది.

- సి.రఘునాథరెడ్డి, నర్సింగాపురం

ఆటలతో ఆయుష్షు పెరుగుతుంది.

బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసి రిటైరయ్యాను. గత 30ఏళ్లుగా టెన్నిస్ ఆడుతున్నా. ఎన్నో టోర్నీలో పాల్గొని రాణించాపే. ఆటల వల్ల ఆయుష్షు పెరుగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటలవైపు ప్రోత్సాహించాలి. మానసిక వికాసం, దేహ దారుఢ్యం లభిస్తుంది. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనే ధైర్యం అలవడుతుంది. మనసు ధృడంగా ఉంటుంది. పోటీతత్వం పెరిగితే అన్ని రంగాల్లోనూ ముందంజ వేయవచ్చు.

- యు.ఆనందకేశవులు, తిరుపతి



తైపూస కృత్తిక వేడుకలు

● మురుగన్ ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అడయార్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తైపూస కృత్తిక వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రంలోని మురుగన్ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తిరుత్తణి, తిరుపోరూర్, పళని ఆలయాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు. అనేక మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. పలు ఆలయాల్లో రోజంతా భక్తులకు అన్నదానం చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. చెన్నై నగర శివారు ప్రాంతమైన తిరుపోరూర్, తిరుత్తణి మురుగన్ ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. అదేవిధంగా పళని మురుగన్ ఆలయం, కుండ్రత్తూరు, విల్లకోట, శిరువాపురిలోని మురుగన్ ఆలయాల్లో కూడా తైపూస కృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు.

త్వరలో గ్రీన్‌వేస్ రోడ్డు - అడయార్ జంక్షన్

మెట్రో సొరంగం పనులు పూర్తి

పెరంబూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెండో విడత మెట్రో రైలు ప్రాజెక్టులో మాధవరం - సిరుసేరి సిప్కాట్ మార్గంలో గ్రీన్‌వేస్ రోడ్డు నుంచి అడయార్ జంక్షన్ వరకు రెండవ సొరంగమార్గం తవ్వే పనులు త్వరలో ముగియనున్నాయని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులు తెలిపారు. నగరంలో రెండవ విడత మెట్రో రైలు ప్రాజెక్ట్ మూడు మార్గాల్లో 116.1 కి.మీ మేర జరుగుతోంది. వాటిలో ఒక మార్గం మాధవరం - సిరుసేరి సిప్కాట్ వరకు 45.4 కి.మీ దూరం మేర పనులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో గ్రీన్‌వేస్ రోడ్డు నుంచి అడయార్ జంక్షన్ వరకు 1.226 కి.మీ దూరం సొరంగం తవ్వే పనులు 2023 ఫిబ్రవరి 16న ప్రారంభమయ్యాయి. మొదటి సొరంగం తవ్వే యంత్రం 'కావేరి', రెండో సొరంగం తవ్వే యంత్రం 'అడయారు' యంత్రాలు ఒకదాని తర్వాత మరొకటి పనులు ప్రారంభించాయి. వాటిలో కావేరి యంత్రం గత ఏడాది సెప్టెంబరు 20న సొరంగం తవ్వే పనులు విజయవంతంగా పూర్తిచేసి అడయార్ జంక్షన్ చేరుకుంది.



సొరంగ మార్గం పరిశీలిస్తున్న సీఎంఆర్ఎల్ అధికారులు

'అడయారు' యంత్రం ఆలస్యం....

రెండో సొరంగం తవ్వే 'అడయారు' యంత్రం పనులు పూర్తిచేసి గత నవంబరులో బయటకు వస్తుందని అధికారులు భావించారు, కానీ, ఆ ప్రాంతంలో గట్టి రాళ్లు ఉండడంతో నిర్ణీత సమయంలో పనులు పూర్తికావడంలో జాప్యం జరిగింది. ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారులు మాట్లాడుతూ... గ్రీన్‌వేస్ రోడ్డు- అడయార్ జంక్షన్ మధ్య రెండో సొరంగం తవ్వే యంత్రాన్ని ఈవారంలో బయటకు తీసుకురానున్నామన్నారు. అడయార్ నది కింద కొన్ని ప్రాంతాల్లో గట్టి బండరాళ్లు ఉండడంతో, సొరంగం తవ్వడం సవాలుగా మారిందని, అందువల్ల రెండు నెలలు ఆలస్యమైందన్నారు. రెండో విడత ప్రాజెక్ట్‌లో మొత్తం 68 కి.మీ మేర సొరంగ మార్గం ఏర్పాటుకావాల్సి ఉండగా, ఇప్పటివరకు 18 కి.మీ పూర్తిచేశామని తెలిపారు. మిగిలిన పనులు పూర్తిచేసి 2028వ సంవత్సరంలో ఈ మార్గాల్లో మెట్రోరైళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయంలో టాయిలెట్లకు తాళం

● దివ్యాంగులు, మహిళల ఇక్కట్లు



తాళం వేసిన మహిళల టాయిలెట్

తిరుత్తణి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న మహిళలు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి గాంధీ రోడ్డు సమీపంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయానికి ప్రతిరోజు పనుల కోసం ప్రజలు అధికంగా వస్తుంటారు. ప్రజలు సౌకర్యార్థం కార్యాలయ వెనుక టాయిలెట్లు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులుగా దివ్యాంగులు, మహిళలు వెళ్లే టాయి లెట్లు తాళాలు వేసి కనిపిస్తున్నాయి. దీంతో, కార్యాలయానికి వస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, టాయిలెట్లు ప్రజల వినియోగానికి ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్పీడ్ స్కేటింగ్‌లో 'బంగారు' యోమిత

అడయార్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన టీవీ యాంకర్ దేవా కుమార్తె యోమిత స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో అద్భుతంగా రాణిస్తోంది. ఇటీవల బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. స్థానిక కేకే నగర్‌లోని స్పంక్ రోలర్ స్కేటింగ్ అకాడమీలో ఆరేళ్ల నుంచి శిక్షణ పొందుతోంది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇప్పటివరకు 23 బంగారు, 4 రజత పతకాలతో పాటు రెండు అవార్డులు, 3 వ్యక్తిగత చాంపియన్‌షిప్ ట్రోఫీలను సాధించింది. జనవరిలో మదురైలో స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎస్ఎఫ్) నిర్వహించిన 24వ చాంపియన్‌షిప్‌లో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ, పుదుచ్చేరి, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్, అసోం రాష్ట్రాల నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో యోమిత అండర్-8 విభాగంలో 200 మీటర్లు, 400 మీటర్లలో బంగారు పతకాలతో పాటు వ్యక్తిగత చాంపియన్‌షిప్ టైటిల్‌ను సైతం గెలుచుకుంది. జూన్ నెలాఖరులో ఇండోనేషియాలో ఇంటర్నేషనల్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనుంది.



టైటిల్‌తో యోమిత

మహర్షి విద్యా మందిర్‌లో

స్పోర్ట్స్ ఎరీనా ప్రారంభం



స్పోర్ట్స్ ఎరీనాను ప్రారంభిస్తున్న కివిరాజ్ గ్రూపు చైర్మన్ నవరత్నముల్ చోర్డియా

అడయార్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన తిరునీర్‌మలైలో కివిరాజ్ ఫౌండేషన్‌కు చెందిన న్యూఢిల్లీలోని సీబీఎస్ఈ గుర్తింపు పొందిన మహర్షి విద్యా మందిర్‌లో కొత్తగా నవరతన్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రారంభించారు. తద్వారా ఈ విద్యా మందిర్‌లో రాష్ట్ర స్థాయి క్రీడా సదుపాయాలను కల్పించారు. ముఖ్యంగా పదికిపైగా క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఎరీనాను కివిరాజ్ గ్రూపు చైర్మన్ నవరత్నముల్ చోర్డియా ప్రారంభించారు. ఈ ఎరీనాలో 50 ఎంఎం ఆర్టిఫిషియల్ టర్ఫ్ ఫుల్‌సైజ్ బాస్కెట్‌బాల్ కోర్టు, 10 ఎంఎం ఆర్టిఫిషియల్ టర్ఫ్‌తో క్రికెట్ నెట్ కమ్ ఆర్చెరీ సెంటర్, 2 పికెల్‌బాల్ కోర్టులు, మల్లకంబు కోర్టు, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ వంటి క్రీడల కోసం మల్టీ కోర్టులు అందుబాటులోకి వచ్చాయి. ఈ సెంటర్ ప్రారంభోత్సవంలో మహర్షి విద్యా మందిర్ స్కూల్స్ గ్రూపు చైర్మన్ అజయ్ ప్రకాష్ శ్రీవాస్తవ, డైరెక్టర్ నీలకంఠ పిళ్లై, మాజీ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు సీవీ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో ఇగ్నిథో ఏఐ సెంటర్

● ప్రారంభించిన మంత్రి త్యాగరాజన్



'ఇగ్నిథో ఏఐ' సెంటరును ప్రారంభిస్తున్న మంత్రి పళనివేల్ త్యాగరాజన్ తదితరులు

అడయార్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇగ్నిథో ఇండియా ఏఐ కంపెనీ తన సేవలను చెన్నై నగరానికి విస్తరించింది. నగర శివారు ప్రాంతమైన షోళింగనల్లూరులోని ఎల్‌కాట్ సెజ్‌లో కొత్త కార్యాలయాన్ని రాష్ట్ర మంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగరాజన్ గురువారం ప్రారంభించారు. వచ్చే రెండేళ్లలో ఏఐ సామర్థ్యాలపై దృష్టి సారించిన ఇగ్నిథో తన సిబ్బంది సంఖ్యను వెయ్యికి పెంచుకోనుంది. ఈ వ్యూహాత్మక వృద్ధి ప్రణాళికలో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సెంటర్ ఏఐ ఆవిష్కరణలకు అత్యుత్తమ కేంద్రంగా ఉంటుందని ఇగ్నిథో తాత్కాలిక సీఈవో రోనీ సోలోమాన్ చెప్పారు.



కోయంబత్తూరు జిల్లా వయ్యంపాళయంలో రైతు బాంధవుడు సి. నారాయణసామినాయుడు శతజయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రుల ఎంపీ సామినాథన్, వి.సెంథిల్‌బాలాజీ, రైతు సంఘాల నేతలు

రెండు బైకుల ఢీ: ఒకరి మృతి

ప్యారీస్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు సమీపంలోని పట్టరపెరంబదూరులో వేగంగా వెళ్లిన రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తిరుత్తణి సమీపంలోని పొంబాడి తడుకుపేటకు చెందిన మురళి (35) చెన్నై నుంచి తన ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరాడు. అదే విధంగా తిరువలంగాడు ప్రాంతానికి చెందిన తిరునావుక్కరసు (28)కూడా తన బైక్‌లో తిరువళ్లూరుకు బయలుదేరాడు. ఈ రెండు బైకులు తిరువళ్లూరు సమీపంలోని పట్టరపెరంబదూరులో ఉన్న ఫ్లైఓవర్‌పై వెళ్తున్న సమయంలో ఊహించని విధంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తలకు బలమైన గాయాలై మురళి అక్కడికక్కడే మృతి చెందగా, గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న తిరునావుక్కరసును పాదచారులు అంబులెన్స్ ద్వారా తిరువళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చెన్నై రిప్పన్‌భవనంలో మేయర్ ఆర్.ప్రియతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన ఆస్ట్రేలియా డిప్యూటీ రాయబారి సీలై జాకి



ఫెయిర్‌ప్రో వివరాలు వెల్లడిస్తున్న కన్వీనర్ కృతివాస్ తదితరులు

14 నుంచి ఫెయిర్‌ప్రో ఎగ్జిబిషన్

బ్రాండ్ అంబాసిడర్‌గా నటి త్రిష

అడయార్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో క్రెడాయ్ (ది కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో 17వ ఎడిషన్ ఫెయిర్‌ప్రో 2025 ప్రదర్శన ఈనెల 14నుంచి ప్రారంభం కానుంది. దీన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనుండగా, బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ సినీ నటి త్రిషను ఎంపిక చేశారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లో వన్ స్టాప్ డెస్టినేషన్‌గా 500కుపైగా ప్రాజెక్టులు, 32.2 మిలియన్ చదరపుటడుగుల విస్తీర్ణంలో ఉండే నివాస భవనాలు, స్థలాలకు కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచనున్నారు. సొంతింటి కలను నిజం చేసుకోవాలని భావించే వారికి ఇది మంచి తరుణమని ఫెయిర్‌ప్రో కన్వీనర్ పి.కృతివాస్, భారతీయ స్టేట్ బ్యాంకు నెట్‌వర్క్-1 చెన్నై సర్కిల్ జనరల్ మేనేజర్ ఎంవీఆర్ మురళికృష్ణ చెప్పారు.